



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు తూకం చూస్తున్న టీచర్



కామాయిపేటలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం



అంగన్‌వాడీలకు.. కొత్త భవనాలు

- ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి వస్తున్న నూతన భవనాలు
- మొత్తం 155 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రూ.7.82 కోట్లు మంజూరు
- జిల్లాలో 101 నూతన భవనాల నిర్మాణం కోసం రూ.5.12 కోట్లు మంజూరు కాగా.. 78 భవన నిర్మాణాలు పూర్తి
- పూర్వ ప్రాథమిక విద్య అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఏజెన్సీలోని కిశోర బాలికలకు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందజేత
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నేతృత్వంలో ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పరిశీలన
- జిల్లావ్యాప్తంగా మొత్తం 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు

ఉట్నూర్, జూలై 28: ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో నెలకొల్పిన అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జిల్లాల్లో ఉన్న గిరిజన గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేస్తూ గత సంవత్సరం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 155 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రూ.7.82కోట్లు మంజూరు చేసింది. 121 భవనాల నిర్మాణం పూర్తికాగా, 20 భవనాల పనులు పురోగతిలో ఉండగా, 14 భవనాల పనులు వివిధ కారణాలతో ప్రారంభించ లేదు. ఇప్పటి వరకు రూ.6.10 కోట్లు ఖర్చు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు 101 భవనాలు రూ.5.12 కోట్లతో మంజూరు కాగా 78 భవనాల పనులు పూర్తయ్యాయి. మరో 17 పురోగతిలో ఉండగా ఎకోరి, గురిజ, కోలాంగూడ, ఏంపల్లి, హీరాపూర్ (శాంతాపూర్)లలో భవనాల పనులు ప్రారంభించ లేదు. రూ.4కోట్లు ఖర్చు చేశారు. మంచిర్యాల జిల్లాలో 21 అంగన్‌వాడీ భవనాల కోసం రూ.కోటి మంజూరు కాగా 13 భవనాల నిర్మాణాలు పూర్తికాగా రూ.57.71 లక్షలు ఖర్చు చేశారు. రెండు భవనాల పనులు పురోగతిలో ఉండగా ఆరు భవనాలు కొత్తపేట, కోలాంగూడ, పుట్టిగూడ, ఎన్టీఆర్ కాలనీ, అబ్బాపూర్, మూలమద్దులలో పనులు నిలిచి పోయాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు కాగా రూ.1.65కోట్లు మంజూరయ్యాయి. 30 భవనాల నిర్మాణాలు పూర్తికాగా రూ.1.51కోట్లు ఖర్చు కాగా, ఒక భవన నిర్మాణం పురోగతిలో ఉండగా దంతన్‌పల్లి, సుంగాపూర్‌లలో చేపట్టలేదు. ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావడం పట్ల గిరిజన ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణీ మహిళ ఎత్తు చూస్తున్న టీచర్

పూర్వ ప్రాథమిక విద్యకు కృషి

గ్రామీణ ప్రాంతాలలోని ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు రప్పించి అంగన్‌వాడీ కేంద్రాలలో ఆట పాటల ద్వారా చిన్నారులను పాఠశాలల వైపు మళ్లించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు గిరిజన గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతీరోజు చిన్నారులు చేరుకొని ఆట పాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను నేర్చుకుంటున్నారు. ఐదేళ్లు పైబడిన చిన్నారులను సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పాలు, ఉడికించిన గుడ్లు, ఇవ్వడంతో పాటు పల్లిపట్టీలు, రాగి సంకటి లాంటి పౌష్టిక ఆహారం అందించడానికి మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర బాలభ్యుదయ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు కృషి చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 973, మంచిర్యాల జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి.

అందుబాటులోకి పౌష్టికాహారం

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు సైతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం అందుబాటులోకి తెచ్చారు. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నేతృత్వంలో ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కిశోర బాలికలకు పౌష్టిక ఆహారం అందించేలా కృషి చేయడంతో పాటు గ్రామాలలో ఉన్న గర్భిణుల బరువు పరిశీలిస్తూ క్రమం తప్పకుండా వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆరోగ్య కార్యకర్తల ద్వారా కావాల్సిన వైద్య సూచనలు సలహాలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న బాలింతలకు సైతం పౌష్టిక ఆహారం అందించే సౌకర్యం అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించడంతో ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం అంశాలను వివరించి పౌష్టిక ఆహారం అందిస్తున్నారు. ప్రసవం తర్వాత కూడా తల్లీబిడ్డల ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలను తీసుకుంటున్నారు.

వీటీడీఏల ద్వారానే పనులు చేయించాం

: రాథోడ్ భీంరావు, ఈఈ, ఐటీడీఏ ఉట్నూర్



ఉట్నూర్ ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వీటీడీఏల ద్వారా 121 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణ పనులు పూర్తి చేశాం.

అంగన్‌వాడీ కేంద్రాలతో సత్ఫలితాలు

: సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



గ్రామీణ ప్రాంతాలలోని చిన్నారులకు, కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు సేవలు అందుబాటులో ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు చిన్నారులకు పూర్వ విద్యా అందించడంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నారు. చిన్నారుల్లో, గర్భిణీలలో, బాలింతల్లో రక్తలేమి లోపం ఏర్పడకుండా పౌష్టిక ఆహారం ప్రభుత్వం ఉన్నతాధికారుల సూచనల మేరకు అందించడం జరుగుతుంది.

సంక్షిప్త సమాచారం



సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తివేసిన దృశ్యం

సాత్నాల ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

జైనథ్, జూలై 28: మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ప్రాజెక్టులో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు భారీగా చొరబడింది. దీంతో సాత్నాల నీటిపారుదల శాఖ అధికారులు ఆదివారం వేకువ జామున ప్రాజెక్టు గల నాలుగు గేట్లలో రెండు గేట్లను వదిలి వేసి వరదనీటిని దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 286.50 ఎంఎం కాగా కనిష్ఠ సామర్థ్యం 284.70 ఎంఎంకు చేరుకోవడంతో రెండు గేట్లను ఎత్తి వేశామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. కాగా ప్రాజెక్టు సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 0.853 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1153 క్యూసెక్కులు కాగా ఔట్‌ఫ్లో 1153 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ మారుతిలు పర్యవేక్షిస్తున్నారు.

పారిశుధ్యంపై అవగాహన

తాంసి, జూలై 28: వర్షాకాలం ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆశా వర్కర్లు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం మండలకేంద్రంలోని పలు వీధుల్లో తిరుగుతూ మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని పలు జాగ్రత్తల గురించి వివరించారు. క్లోరినేషన్ ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు లక్ష్మీ, పద్మక్క, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ బోనాల జాతర

- జిల్లాకేంద్రంలో బోనాలతో మహిళల శోభాయాత్ర
- పెద్దపోచమ్మకు ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 28: ఆషాఢ మాసంలో బోనాల పండుగను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల జాతర వేడుకలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల శోభయాత్ర పట్టణంలోని పుర వీధుల గుండా అశోక్‌రోడ్‌లోని పెద్ద పోచమ్మ ఆలయం వరకు సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ అధ్యక్షుడు భోజారెడ్డి, బీజేపీ నేత పాయల శరత్, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాలదత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త బండారదేవన్నతో పాటు గాండ్ల సంఘం అధ్యక్షుడు రాజేశ్, ప్రధాన కార్యదర్శి చందులతో పాటు కులస్థులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముందుగా బోనాల కుండలను తల పై పెట్టుకొని శోభాయాత్రలో పాల్గొన్నారు. దారి పొడవునా పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుల మధ్య, డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఆదివారం భక్తీ శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌లోని తిర్పెల్లి నుంచి బోనాల శోభాయాత్ర నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలు నెత్తిపై ఎత్తుకొని ర్యాలీగా వెళ్లి స్థానిక మహాలక్ష్మి ఆలయం వద్ద బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఇందులో పద్మశాలి సంఘం సభ్యులు మంచికట్ల ఆశమ్మ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, కాలనీ మహిళలు తదితరులున్నారు. కాగా జిల్లా కేంద్రంలో బోనాల వేడుకలను అంగరంగ వైభంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆయా కాలనీలలోని పోచమ్మ ఆలయాలకు భక్తులు బారులు తీరారు.



ఆదిలాబాద్‌లో తలపై బోనాల కుండతో మహాలక్ష్మి ఆలయానికి వెళ్తున్న మహిళలు, పద్మశాలీ సంఘ సభ్యులు



గుడిహత్నూర్‌లో బోనాలతో తరలివెళుతున్న మహిళలు

గుడిహత్నూర్: మండలకేంద్రంలోని ఎక్స్ రోడ్డు హనుమాన్ నగర్ కాలనీ వాసులు ఆదివారం ఆషాఢ మాసం బోనాలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. కాలనీకి చెందిన మహిళలు హనుమాన్ ఆలయం నుంచి బోనాలకు కుంకుమ, పసుపు, వేప కొమ్మలతో అలంకరించి ఊరేగింపుగా డప్పు చప్పుళ్ళతో పోతరాజు నృత్యాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అందరూ క్షేమంగా ఉండాలని పూజలు నిర్వహించి వేడుకున్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఎంపీ

తలమడుగు: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి కాపాడుకుంటూ వస్తున్న తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. సుంకిడి గ్రామంలో ఊరంతా కలిసి ఒకే రోజు బోనాల పండుగ నిర్వహించడం ఎంతో అభినందనీయం అన్నారు. గ్రామ దేవతలకు గ్రామస్తులంతా పూజలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామ దేవతలను పూజించడం వల్ల వర్షాకాలంలో పలు అంటూ వ్యాధులు ప్రబలకుండా దేవతలు రక్షిస్తారన్నారు. అదే విధంగా పాడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, బీజేపీ మండల కన్వీనర్ స్వామి, జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, నారాయణరెడ్డి, బొండ్ల వెంకట స్వామి, కుంటాల శ్రీకాంత్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు..





సుంకిడిలో ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ నగేష్

ఐటీడీఏ పీవోకు సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేషన్ హక్కులు కొనసాగించాలి

- తుడుందెబ్బ జిల్లా నాయకుల డిమాండ్

ఉట్నూర్, జూలై 28: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం చూడడంతో పాటు గిరిజనుల భూమి సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి గతంలో ఉన్న ప్రభుత్వాలు కల్పించిన సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేషన్ హక్కులు కొనసాగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుకబాపురావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ ఏజెన్సీ పరిధిలోని సివిల్ కేసులు ప్రాజెక్టు అధికారి వద్ద దివాలు ఫైల్ చేయుటకు అనుమతి కల్పించి, అట్టి కేసులు పరిష్కరించుటకు ప్రాజెక్టు అధికారికి శాశ్వత అధికారులు కల్పించేలా ప్రభుత్వం పరంగా తగిన చర్యలు తీసుకోవాలని తుడందెబ్బ డిమాండ్ చేస్తుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నాయని అన్నారు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడానికి 1970లో అప్పటి ప్రభుత్వం భూబదలాయింపు నిషేద చట్టాన్ని అమలులోకి తెచ్చింది అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పరిపాలన అందించుటకు, ఆదివాసీలు భూ సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వ ప్రతినిధిగా ఐటీడీఏ పీవోను ప్రత్యేకంగా నియమించి ఏజెన్సీ ప్రాంత భూమి సమస్యలు పరిష్కరించే అధికారాలు కల్పించిందన్నారు. ప్రత్యేకించి ఏజెన్సీ భూమి సమస్యలు పరిష్కరించుటకు అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఐటీడీఏ ఏర్పాటు జరిగిన్పటి నుంచి ఈ రోజు వరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు అభివృద్ధితో పాటు సివిల్ వివాదాలు పరిష్కారం కోసం ప్రాజెక్టు అధికారి వద్ద కేసులు పరిష్కరించుకుంటున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిరక్షరాస్యులు, అమాయకులు, ఇతర ప్రాంతాల మీద అవగాహన లేని అమాయక ప్రజలు ఇలాంటి ప్రజల ఆలోచన విధానాలకు వారి వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించే అవగాహన ప్రాజెక్టు అధికారికి మాత్రమే ఉంటుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుక బాపురావు

అంతేకాకుండా, ప్రాజెక్టు అధికారి ఏజెన్సీ ప్రాంతంలో నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి గిరిజనుల స్థితిగతులను, మానసిక పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించే అవకాశం ప్రాజెక్టు అధికారికి మాత్రమే ఉంటుందన్నారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ కేసులు పరిష్కరించేందుకు గాను 2002 సంవత్సరంలో ప్రభుత్వం అధికారాలు కల్పించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ కేసులు ప్రాజెక్టు అధికారి వద్ద వేల కేసులు పరిష్కరించబడుతున్నాయన్నారు. కొంత మంది అవకాశవాదులు న్యాయస్థానాలను తప్పుపట్టించే విధంగా ప్రాజెక్టు అధికారికి సివిల్ కేసులు పరిష్కరించే అధికారాలు లేవని ప్రకటించడం సరైనది కాదని అన్నారు. త్వరలోనే ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఐటీడీఏ పీవోపీ ఉన్న అధికారాలను కాపాడాలంటూ కోరుతామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో ఉన్న ప్రభుత్వాలు అమలు చేసిన సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ ప్రతినిధులు కుడిమెత తిరుపతి, సెడ్మకి సీతారామ్, ఆడ హనుమంతరావు, పెందూరు ధర్ము, కురిసింగ అచ్యుత్ రావు, కుమ్రభాలేరావు, కుమ్రమనోజ్‌లు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి నైవేద్యాలు

తాంసి, జూలై 28 : పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు వంకలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గంగమ్మ తల్లికి నైవేద్యాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగానదికి వెళ్లి మహిళలు నైవేద్యాలతో కూడిన అప్పాలు, గారెలు వేసి గంగమ్మ తల్లి శాంతించాలని వేడుకున్నారు.

మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

నిర్మల్ అర్బన్, జూలై 28: నిర్మల్ జిల్లా కేంద్రంలోని అత్యంత పురాతనమైన బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా ఆదివారం ఉదయం డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. అమ్మవారి దీవెనలు, చల్లని దయ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. శ్రీహరి రావుతో పాటు నిర్మల్ తాజా మాజీ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, నాయకులు తారక రఘువీర్, గంగోని బురాజ్, వంశీ, అరవింద్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

సిరికొండ, జులై 28 : కొన్ని రోజుల క్రితం సిరికొండ మాజీ ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న తండ్రి తోకల రాజన్న అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఎంపీ నగేష్ వారి కుటుంబాన్ని ఆదివారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం రాజన్న చిత్రప టానికి నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, గోర్బండ్ బాలాజీ, మాజీ ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్, జింక లక్ష్మణ్, లక్కం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సేన ఆధ్వర్యంలో

మెగా రక్తదాన శిబిరం

గుడిహత్నూర్, జూలై 28: ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి జన్మదినం సందర్భంగా ఆదివాసి సేన ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటి కార్యక్రమం నిర్వహించారు. కేక్‌కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన వారిని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వ్యాపారవేత్త ఏలేటి అశ్వినిరెడ్డి, ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ వారిని అభినందిచారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి తోడసం లక్ష్మణ్, జిల్లా సలహాదారుడు ఉయిక లక్ష్మణ్, ఆదివాసి సేన మండల అధ్యక్షులు సెడ్మకి భీంరావు, మండల కార్యదర్శి ఉయిక శ్యామ్‌రావు, ఆదివాసి విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, రైతు సేన మండల అధ్యక్షులు కుంరం రాందాస్, రైతు సేన మండల కార్యదర్శి వెడ్మ చంపత్‌రావు, ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కుంరం దశరథ్, ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి చేయూతనిస్తాం

భైంసా, జూలై 28: దివ్యాంగులకు అవసరమైన చేయూతనందిస్తూ వారి సంక్షేమానికి తోడ్పాటునిస్తామని తూమోల్ల ముత్తన్న సేవా సమితి అధ్యక్షులు తూమోల్ల దత్తాత్రి వెల్లడించారు. ఆదివారం భైంసా పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీకు చెందిన అరె విఠల్ పాటిల్ అనే దివ్యాంగునికి తమ సమితి ద్వారా ట్రై సైకిల్‌ను అందించిన సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడారు. సకాలంగులకు దీటుగా దివ్యాంగులు ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో దివ్యాంగుల సహాయార్థం తమ సేవా సమితి ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు. ఇందులో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తోట లింగురామ్, గణేష్ కాలనీ పరిధిలోని మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి సమయం ఇవ్వాలి'

సిరికొండ, జులై 28: సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని బీజేపీ నాయకులు అనడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం సిరికొండ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కాలేదు, కానీ బీజేపీ గత పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉండి మండల సమస్యలు పరిష్కరించకపోగా.. కనీసం గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసి తీరుతుందని అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో సైతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండలంలోని చిక్మాన్ ప్రాజెక్ట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని పెర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, మైనార్టీ మండల చైర్మన్ ఎండీ రంజాన్, కంచం లక్ష్మణ్, ఐకేపీ వీఓఏ బొడ్డు దత్తు, కత్తెర్ల రాజేష్, జింక మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

31న చలో హైదరాబాద్

నార్నూర్, జూలై 28: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ పిలుపు మేరకు ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడే నాందేవ్‌పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 22 సంవత్సరాల క్రితం ఈ పథకం ప్రారంభమైన అప్పటి నుంచి మేము పని చేస్తున్నాము. కేవలం 1000 రూపాయల వేతనంతో వంటలు చేసి పిల్లలకు వడ్డిస్తున్నాము.గత ప్రభుత్వాలతో అనేక పోరాటాల అనంతరం 2000 పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో మా వేతనాన్ని పదివేలకు చెల్లించాలని మా డిమాండ్ చేయడం జరిగింది. అలాగే కోడిగుడ్ల సరఫరా చేయాలి,ఇప్పుడు ఇస్తున్న చార్జీలు సరిపోవడం లేనందున మెను చార్జీలు 25శాతం పెంచాలి, గ్యాస్, వంటలకు సరుకులు మొత్తం ప్రభుత్వ చేయాలి. డిసెంబర్ నెల నుంచి ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. వారి వెంట జాడేతాయి సులోచన, బాయిగేదం జైతుబాయి, లిముబున భై పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

బజార్‌హత్నూర్, జూలై 28: మండలం పరిధిలోని గోకొండ గ్రామానికి చెందిన నిండు గర్భిణి జాట్వే కిరణ్ బాయికి సాయంత్రం సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్సు సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణిని హాస్పిటల్‌కు తీసుకువస్తున్న దారిలో చింతల్‌సాంగ్వి గ్రామంలో పురిటి నొప్పులు అదికమవడంతో అక్కడే ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటి రవీందర్, పైలెట్ రాజారాం తెలిపారు.

హస్నాపూర్ టీచర్‌కు స్వర్ణనంది సేవారత్న పురస్కారం

ఉట్నూర్, జూలై 28: మండలంలోని హస్నాపూర్ స్వామి వివేకానంద యూత్ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలకు అత్యంత పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభలో జరిగిన మెగా ఎంటర్‌ప్రైసెస్ స్వర్ణనంది సేవారత్నక అవార్డు కార్యక్రమంలో శ్రీస్వామి వివేకానంద యూత్ హస్నాపూర్ సభ్యుడు,ఉపాధ్యాయుడు రాథోడ్ మహేందర్ నాయక్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, సిని ప్రముఖులు జెమినిసురేష్, ఫిట్‌నెస్ అను, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పురుషోత్తం శిరీషరెడ్డిలచే అవార్డు, సేవారత్న పత్రం అందుకున్నారు.అనంతరం శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా మహేందర్‌నాయక్ మాట్లాడుతూ శ్రీస్వామి వివేకానంద యూత్ హస్నాపూర్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అయిన మెగా రక్తదాన శిబిరాలు, పేదింటి ఆడ పిల్లలకు వివాహాలు జరపడం, అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఇలాంటి వేదికల్లో అవార్డు ఇవ్వడంతో మా సంఘం సభ్యులకు ఇంకా ముందుకు సాగేలా ప్రోత్సాహకం లభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

భీమన్న చెరువు నీటి విడుదల

పెంబి, జూలై 28: మండల కేంద్రంలో గత కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు భీమన్న చెరువు నిండు కుండలాగా తలపిస్తుంది. దీంతో చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాలలో వరి పంట సాగు చేయడంతో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మైసమ్మకు పూజలు చేసి భీమన్న చెరువు నీటి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నరేందర్, తులాల శంకర్, పుప్పాల రాజేందర్, ఐదు వెంకటేష్, చింతకింది రాజేందర్, తదితరులు ఉన్నారు.

చెరువును తలపిస్తున్న మైదానం

ఆదిలాబాద్ రూరల్, జూలై 28: ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువు అనుకుంటే మీరు పొరపడినట్లే జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానం ఇలా చెరువును తలపిస్తున్నది. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెట్టు పక్కల కాలనీ వాసులు రోగాల బారిన పడే అవకాశం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా మందులు స్ప్రే చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మైదానంలో నిలిచిన వర్షపు నీరు

25 ఏళ్లకు.. అపూర్వ సమ్మేళనం

● మధుర స్మృతులను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు



సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, జూలై 28: చిన్న నాడు బడిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలిశారు. పదో తరగతి పూర్తయ్యాక ఎవరి దారిలో వారు వెళ్లారు. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 25 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి చిలిపి, అల్లరిచేష్టలు, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని ఒక్కసారి పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. బాల్యమే బాగుడూ అంటూ చర్చించుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ అపురూపమైన ఘట్టానికి ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల వేదికయింది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతోపాటు ఈ మధుర జ్ఞాపకాలను సెల్ ఫోన్‌లు, కెమెరాల్లో బంధించారు. అనంతరం గురువులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో గురువులు సూర్యకాంత్, మనోజ్ రెడ్డి, ఎన్రాల నగేష్, ధరహాస, గోవర్ధన్, నైన, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితుల కోసం పోరాడిన వ్యక్తి కాంబ్లే



నాందేవ్‌కాంబ్లే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉన్న షెడ్యుల్డు కులాల ప్రజల హక్కుల కోసం గత నలభై సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు పోరాడని వ్యక్తి నాందేవ్‌కాంబ్లే అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనేత్ గజానంద్‌నాయక్ అన్నారు. నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో వారి స్వగృహంలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం నివసిస్తున్న దళిత ప్రజలకు చాలా వరకు హక్కుల లేక వారు అనేక సమస్యలకి ఇబ్బంది పడుతున్నారు. జాతి హక్కుల సాధన ఏకైకా లక్ష్యంతో పని చేసిన మహానీయుడు. గతంలో ఆయన బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి సంబంధాలు ఉండడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ కూడా నియమించారు. గుర్తు చేసినారు. నా జాతికి న్యాయం జరగాలని వేరే వేరే రాష్ట్రాలకి వెళ్లి సంఘ సభ్యులకు కలిసి అక్కడి విధి విధానాలపై సమీక్ష సమావేశం చేసి అక్కడి ప్రభుత్వ గజిట్ పత్రాలు తెచ్చి వాటిని పరిశీలన చేసి తమ హక్కుల కోసం తెలంగాణ ప్రభుత్వం పోరాడిన వ్యక్తి ఆయన మన మధ్యలేక చింతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట న్యనోబాపుష్కర్ నర్సింగ్ మోరేనాందేవ్, గోవిందబానుదాస్, దాదే అల్లి కోరల మహేందర్, ఉదయ్‌కాంబ్లే తదితరులున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 28: ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తూ అనేక విజయాలు సాధించిందని ఏటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తెలిపారు. యాదవ సంఘ భవనంలో రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపును ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రంలో, దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికుల కోసం చట్టాలను సవరించాల్సి ఉండగా ప్రభుత్వాలు ఆ దిశగా సాగడం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో టీచర్లకు రెండు లక్షలు, ఆయాలకు లక్ష రూపాయల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రానున్నాయని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలోని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చిందన్నారు. హామీలకు అనుగుణంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ల్యాబ్‌టెక్నీషియన్ల బదిలీలు

● రాష్ట్ర అధ్యక్షుడు నిజాముద్దీన్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 28: ల్యాబ్ టెక్నీషియన్ల బదిలీల్లో ఇష్టారీతిన వ్యవహరించారని ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజాముద్దిన్ ఆరోపించారు. ఆదివారం టీఎన్జీవోస్ భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. బదిలీలపై చర్చించి వెంటనే సవరించాలని కోరారు. ఈసందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్ల బదిలీలో భాగంగా పెట్టుకున్న ఆప్షన్లను కాకుండా ఇష్టారీతిన బదిలీలు చేశారన్నారు. ఉపాధ్యాయులు ఏ విధంగానైతే జీవో 317తో నష్టపోయారో తాము కూడా అలాగే నష్ట పోతామన్నారు. ఆదిలాబాద్ వారికి నిజామాబాద్, నిజామాబాద్ వారికి ఆదిలాబాద్ బదిలీ చేశారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకుంటు న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం అన్సరీ, ప్రభాకర్, మడావి శ్రీనివాస్, జీవన్, సంతోష్‌కుమారి, సూర్యకళ, శివకాంత తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించాలి



బుద్ధ ధర్మాన్ని బోధిస్తున్న పూజ్య భంతే జీవక్

ఇంద్రవెల్లి, జూలై 28: ప్రపంచానికి శాంతి, కరుణ, మైత్రి, అహింసయుత సిద్ధాంతలను బోధించిన గౌతమ బుద్ధుడి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పూజ్య భంతే జీవక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రబుద్ధానగర్ కాలనీలోని సామ్రాట్ అశోక్, బుద్ధ విహార్‌లో వర్షవాస్ సందర్భంగా పూజ్య భంతేలు పూర్ణ, ప్రజ్ఞలతో కలిసి బౌద్ధ అనుయాయులకు బుద్ధుడి బోధనలను ప్రవచించారు. ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధ, దమ్మా, సంఘ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి నిత్య జీవితంలో బుద్ధుడు బోధించిన పంచశీల, ఆర్య అష్టాంగిక మార్గాలను, సిద్ధాంతాలను అనుసరించినప్పుడే ఉన్నతమైన జీవనాన్ని గడపగలమని తెలిపారు. ఈవిశ్వంలో దుఃఖం ఉందని, ఆ దుఃఖాన్ని జయించాలంటే ప్రతి ఒక్కరూ బుద్ధుడు చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్య క్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుండే సంతోష్, సర్వోదయ్, వైజనాథ్, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకు పెట్రేగుతున్న సైబర్ నేరగాళ్లు

● జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
● సెల్‌ఫోన్లకు ఏపీకే యాప్‌ల పేరుతో నకిలీ లింకులు
● జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో బాధితులు
● ఆధార్, బ్యాంకు వివరాలు చెప్పొద్దని, అనవసర లింక్‌లు ఓపెన్ చేయద్దంటున్న అధికారులు
● క్షేత్రస్థాయిలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మోసపోతున్న ప్రజలు



ఇటీవల పీఎం కిసాన్ పేర్లతో వాట్సాప్‌లలో చక్కర్లు కొడుతున్న ఏపీకే లింక్‌లు

బజార్‌హత్నూర్, జూలై 28: రోజురోజుకు సాంకేతికత పెరుగుతుండగా సైబర్ నేరాలు సైతం అదేస్థాయిలో అధికమవుతున్నాయి. స్మార్ట్ ఫోన్ల వినియోగం విరివిగా అందుబాటులోకి రావడంతో నిత్యం ఏదో ఒక యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం అలవాటుగా మారింది. ప్రజల అమాయకత్వం,అత్యాశను ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రోజుకోరకంగా దోచుకుంటున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఏటీఎం కార్డుల నంబర్లు,ఇతర వివరాలు అడగడం,మీకు పర్సనల్ లోన్ అప్రూవ్‌అయిందని కొన్ని వివరాలు చెబితే రూ.50వేల నుంచి రూ.1లక్షవరకు మీ ఖాతాలో జమ అవుతాయని లేదంటే లాటరీలో మీరు బహుమతులు గెలుచుకున్నారని,బహుమతులకు ఎంపికయ్యారని మాయచేస్తూ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత కొద్దిరోజులుగా బ్యాంక్‌ల పేరుతో, పీఎం కిసాన్ పేరుతో ఏపీకే యాప్‌లు వాట్సాప్ గ్రూప్‌లలో వినియోగదారునికి సంబంధం లేకుండా అప్‌లోడ్ అవుతున్నాయి.ఆలింక్‌లను ఓపెన్‌చేస్తే బ్యాంక్‌లోని ఖాతాలు ఖాళీ అవడంతో పాటు ఆ ఫోన్‌లు సైతం హ్యాక్ అవుతున్నాయి. ఫేస్‌బుక్,ఫోన్‌పే, ఇన్‌స్టాగ్రామ్ వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉన్నవారిని తేలికగా ప్రలోభపెడుతున్నారు. వీరి వలలో పడిన వారు ఆర్థికంగా నష్టపోయి, మానసికంగా కుంగిపోతున్నారు. ప్రముఖ బ్యాంకుల లోగోలతో ఇష్టరితిన మెసేజ్‌లు చేస్తు ఖాతాలను ఖాళీ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, పైగా పోలీసుల పేర్లతో ఫోన్‌కాల్స్ చేయడం,వారి ఫోటోలను డీపీలుగా పెట్టుకుని మరి బెదిరింపులకు పాల్పడుతు న్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏ కాల్ వచ్చిన స్థానిక పోలీసుస్టేషన్‌లలో సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు.

● వాట్సప్‌లలో ఏపీకే యాప్‌లతో బురిడి

ఇటివల కాలంలో సెల్‌ఫోన్ నంబర్ కు ఆధార్‌తో పాటు బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, ఉద్యోగసమాచారం వంటివన్ని అనుసంధానం చేస్తు లావాదేవిలు చేస్తున్నారు.దీంతో నేరగాళ్ల పని సులువవుతోంది. ఎదో రకంగా ఫోన్‌నంబర్‌ను సేకరించి దానికి ఉన్న యూపీఐ ఐడీని తెలుసుకోవడానికి అనేక రకాల లింక్‌లను సృష్టిస్తున్నారు.అమాయకంగా నొక్కితే ఖాతాలోని డబ్బులు నొక్కేస్తున్నారు సైబర్ కేటుగాళ్లు. వారు తయారుచేసిన ప్రోగ్రామింగ్ యాప్ నుంచి బ్యాంక్ ఖాతా నిలిచిపోయిందని గూగుల్‌పే,ఫోన్‌పై ఇకపై వాడలేరని లేదంటే పర్సనల్‌లోన్ మీ నంబర్‌కు అప్రూవల్ అయిందని,కంపెనీ డీలర్‌షిప్ కల్పిస్తామని,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రకరకాలుగా మాయచేస్తు పలు సందర్భాలలో యాప్‌లను పరిశీలిస్తున్న వారిని ఎంచుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటివల వాట్సాప్‌లలో ప్రముఖ బ్యాంకుల లోగోలతో వాట్సాప్‌లలో ఏపీకే యాప్‌లు చక్కర్లు కొడుతున్నాయి. వాట్సాప్‌లను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు వినియోగదారునికి తెలియకుండా గ్రూప్‌లలో మెసేజ్‌లు పంపుతున్నారు ఆ గ్రూప్‌లలో ఉన్నవారు వచ్చిన మెసేజ్‌లు నకిలివో, ఒర్జినల్‌వో తెలియక కంగారులో సదరు మెసేజ్ లింకును నొక్కగానే వారి ఖాతాలోంచి డబ్బులను నొక్కేస్తున్నారు.

● వందల్లో బాధితులు

సైబర్ నేరగాళ్ల వలకు చిక్కిమోసపోయిన బాధితులు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈరెండు,మూడునెలల్లోనే పదులసంఖ్యలో మోసపోయారు. ముఖ్యంగా పట్టణ కేంద్రంలో నివాసం ఉంటూ బాగా చదువుకుని నిత్యం సెల్‌ఫోన్‌లో జరిగే మోసాలను తెలుసుకుంటున్న వారు సైతం సైబర్ బురిడికి గురవుతున్నారు. కేవలం తమ ఇబ్బందులను గట్టెక్కెందుకు సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో చిక్కి మరింత డబ్బులను పోగొట్టుకుని మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా పరిదిలో నెలల వ్యవధిలోనే అనేక రకాలుగా సైబర్ నేరగాళ్ల గాలానికి చిక్కి లక్షలు పొగొట్టుకున్న వారు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పోలీసు కళాజాతరతో పాటు స్థానిక పోలీసులు అనేక రకాలుగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయిన ఎదో ఒకరూపంలో సైబర్ నేరగాళ్ల వారి పంతను మార్చుకుంటూ దోపిడికి పాల్పడుతునే ఉన్నారు. వాట్సాప్ గ్రూప్‌లలో ఏపీకే యాప్‌లతో పాటు ఈ మధ్య కాలంలో పోలీసుల పేర్లతోనే బెదిరింపులకు పాల్పడి మీ కుటుంబంలోని వ్యక్తి అరెస్టు అయ్యాడని మీరు వెంటనే డబ్బులు తీసుకురావాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఏ కాల్ వచ్చిన స్థానిక పోలీసులను సంప్రదించాలని హెచ్చరిస్తున్నారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



కుంటాల గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, జూలై 28: మండల కేంద్రం కుంటాల గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. ఆషాఢ మాసం సమీపిస్తుండడంతో ఆదివారం భక్తులకు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గంజాయిపై ముథోల్ పోలీసుల ఉక్కుపాదం

● గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు
● 443 గ్రాముల గంజాయి స్వాధీనం కేసు నమోదు



గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్టు చేసిన ముథోల్ పోలీసులు

ముథోల్, జూలై 28: గంజాయి మాదక ద్రవ్యాల రవాణాపై ముథోల్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. పక్కా ప్రణాళికతో ముందస్తు సమాచారం మేరకు ప్రత్యేక టీంగా వెళ్లి గంజాయి రవాణాకు అడ్డుకట్టలు వేస్తున్నారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ముథోల్ ఎస్సై సాయి కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటీవల శుక్రవారం గంజాయి ప్యాకెట్ రూపంలో రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి 443 గ్రాముల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుత కాలంలో విద్యార్థులు యుక్త వయస్సులో విద్యాబుద్దులు నేర్చుకుని, ఉన్నత విద్య, ఉద్యోగాలు సాధించాల్సిన యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవితను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కుటుంబానికి, గ్రామానికి మంచిపేరు తెస్తాడని తల్లిదండ్రులు కలలు కంటుంటే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. నాడు పట్టణాలకే పరిమితమైన గంజాయి భూతం నేడు గ్రామాలకు పాకింది. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ చోరీలకు పాల్పడుతూ, ఇతరులపై దాడులు చేస్తూ ప్రమాదాలకు పాల్పడడం ఎన్నో సంఘటనలుసమాజంలో జరుగుతున్నవి చూస్తున్నాము.

● శతకోటి ఉపాయాలకు అనంత కోటి మార్గాలు

గంజాయిపై దాడులు నిర్వహిస్తూ... కట్టి చేస్తున్న కూడా ఎక్కడో ఒక దగ్గర గంజాయి అమ్మకాలు, రవాణాను అక్రమార్కులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక్కడి ప్రాంతంలో మాత్రం పట్టువదలని విక్రమార్కుడి రీతిలో పోలీసులు దాడులు నిర్వహిస్తూ గంజాయిని పట్టుకుంటున్నారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల పర్యవేక్షణలో, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచ నల మేరకు సీఐ మల్లేష్, ముథోల్ ఎస్సై సాయికిరణ్‌లు టీంగా ఏర్పడి చాకచక్యంగా వ్యవహరించి గంజాయి విక్రయించడానికి వచ్చిన ఇద్దరు నేరస్తులను పట్టుకున్నారు. ఈ నెల 26న ముథోల్ ఎస్సై సాయి కిరణ్‌కు ముథోల్ పరిసర ప్రాంతంలో నిషేధిత గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో వెళ్లి ధర్మబాద్, భైంసాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 443 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎవరైనా గంజాయి మారక ద్రవ్యాలు అమ్మడం రవాణా చేయడం వంటివి ఉంటే ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడుస్తూ అమ్మ నాన్న కన్న కలలను సహకారం చేసుకోవాలని పేర్కొన్నారు.

జోరు వానలో..ఘనంగా బోనాల పండుగ

● ఊరంతా ఒకే రోజు ఒకేసారి బోనం
● తెలంగాణ సంస్కృతికి నిదర్శనం బోనాల పండుగ బోథ్ ఎమ్మెల్యే

తలమడుగు, జూలై 28: తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనం. బోనాల పండుగ ఈ పండుగను ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో జోరువానలో హోరుగా బోనాల పండుగను కన్నుల పండుగగా భక్తి శ్రద్ధలతో ఊరంతా ఒకే రోజు ఒకేసారి బోనాల పండుగను నిర్వహించారు. దశాబ్దాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని పాటిస్తూ కులమత వర్గ విభేదాలు తావివ్వకుండా ఒకే రోజు నిర్వహించడం ఐక్యతకు నిదర్శనం. ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికీ బోనాల పండుగకు గ్రామానికి వచ్చి నైవేధ్యాలను సమర్పించుకుంటారు. అంతేకాకుండా ఆడపడుచులను పండుగకు పిలుచుకుంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక యుగంలో దశాబ్దాల నుంచి వస్తున్న తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు బోనాల పండుగను భక్తి శ్రద్ధతో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పండుగలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అదే విధంగా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌యాదవ్, టీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, యువ నాయకుల పిడుగు అభిరామ్‌రెడ్డి, తోట ప్రమోద్, సునీతారెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, ఆశన్న యాదవ్, తోట శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సుంకిడి పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



నేరడిగొండలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


నేరడిగొండ, జూలై 28: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు.ప్రపంచ ప్రకృతి పరిరక్షన దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రం మీదుగా వడూర్ గ్రామానికి వెళ్లే రహదారి ప్రాంతంలో అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షించాలన్నారు. ప్రకృతిని ప్రేమించడంతో పాటు పర్యావరణను పరిరక్షించేందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి హరిత హారం విప్లవానికి నాంది పలికారన్నారు. ప్రతి గ్రామానికి పల్లె ప్రకృతి వనాలతో పాటు గ్రామానికి వెళ్లే రహదారి వెంట మొక్కలను నాటించారన్నారు. బోథ్ నియోజక వర్గంలో గల జలపాతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.కుంటాల జలపాతం వద్ద త్వరలో ఏకోటూరిజం రిసార్ట్ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు గణేష్, ప్రణయ్, మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, టీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి డా.జహీర్, ఉప్పుపోశెట్టి, దేవేందర్‌రెడ్డి, సాబె ప్రతాప్‌సింగ్, పండరి సద్దాం, సురేం దర్,పాండురంగ్,శ్రీకాంత్, నవీన్, కార్తిక్, స్వామి, ఎఫ్‌బీఓలు ధన్‌సింగ్, భీంజీ,రాజేందర్, గంగామణి, తదితరులున్నారు.

భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం



ఉగ్రరూపంతో ప్రవహిస్తున్న పెన్‌గంగానది

జైనథ్, జూలై 28: జైనథ్ మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా గ్రామాల వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల సరిహద్దున గల మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో మండల సరిహద్దున గల పెన్‌గంగా నది వరద నీటితో ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుంది.దీంతో పాటు జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.దీంతో మండలంలోని గిమ్మా,జైనథ్ గ్రామాలలో గల చిన్ననీటి పారుదల చెరువులు నీటితో జలకళను సంతరించుకున్నా యి. దీంతో పాటు మండలంలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టు నిండుకుండల జలకళను సంతరించుకుంది.ఈ భారీ వర్షాలకు పంటలకు నష్టం వాటిళ్లనుండగా ప్రజలు కూలీలు రైతులు పనులు లేక ఇండ్లకే పరిమితం అయ్యారు.



జలకళను సంతరించుకుంటున్న సాత్నాల ప్రాజెక్టు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సృజన విద్యానిలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కుంటాల, జూలై, 28: కుంటాల సృజన విద్యానిలయంలో పాఠశాలలో 2003-04సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న అప్పటి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే వేదికపై 20 సంవత్సరాల తర్వాత అందరూ ఒకచోట కలవడంతో చిన్ననాటి జ్ఞాప కాలను గుర్తు చేసుకున్నారు.

ఆరోగ్యకరమైన మాంసాన్నే విక్రయించాలి



మాంసం దుకాణాలను తనిఖీ చేస్తున్న డాక్టర్ పర్వేజ్ అహ్మద్

బజార్‌హత్నూర్, జూలై 28: మండల వాసులకు ఆరోగ్యకరమైన మాంసాన్ని అందించాలని మండల పశువైద్యదికారి పర్వేజ్ అహ్మద్ మాంసం విక్రయదారులకు సూచించారు. ఆదివారం రోజున మండల కేంద్రంలోని పలు మాంసం విక్రయ శాపులను ఆయన అకస్మికంగ తనిఖీ చేశారు. ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతూ వ్యాధుల బారిన పడిన మేకలను,కోళ్లను విక్రయించకూడదని, వాటి వలన వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున ఆరోగ్యకరమైన మాంసాన్నే మాత్రం విక్రయించాలని అన్నారు.వినియోగదారులు మాంసాన్ని తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాంసం నిర్వాహకులు షాపుల వద్ద పరిశుభ్రతను పాటించాలని వారికి సూచించారు. ఎక్క డైన అనారోగ్యకరమైన మాంసాన్ని విక్రయించినట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారంఅందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ



ఉట్నూర్‌లో రోగులకు డ్రాగన్ ఫ్రూట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, జూలై 28: డ్రాగన్ ఫ్రూట్స్ పేరు వింటేనే, ఎంతో ఖరీదైన పండు అని అందరికి తెలుసు. కాని ఉట్నూర్ మండలంలో తొలిసారిగా డ్రాగన్ ఫ్రూట్స్ పండించిన రైతు ఉట్నూర్ సివిల్ ఆసుపత్రిలోని రోగులకు పంపిణీ చేశారు. ఉట్నూర్ మండలంలోని చీమనాయక్‌తండాకు చెందిన రైతుజాదవ్‌రాజ్‌కుమార్ తనకు ఉన్న నాలుగు ఎకరాల పంట భూమిలో తొలిసారిగా డ్రాగన్ ఫ్రూట్స్ పండించారు. తొలిపంటను అమ్ముకుంటే ఆర్థికంగా డబ్బులు వస్తాయని అందరు భావిస్తారు. కాని రైతు ఆదివారం తన తొలి పంటలోని పండ్లను ఉట్నూర్ ఆసుపత్రిలోని రోగులకు 500 పండ్లను పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు.రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఈపనులు ఎంతో మేలు చేస్తాయని డాక్టర్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయన వెంట డాక్టర్ కపిల్, బానోతురామారావు,జాదవ్‌శివాజి, పవర్‌దేవిదాస్, ఆడే విశ్వ నాథ్,జాదవ్‌బహదూర్‌సింగ్, కృష్ణ,తరుణ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత : ఎఫ్ఆర్‌వో




మొక్కలు నాటుతున్న అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, జూలై 28: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎఫ్ఆర్‌ఓ గులాబ్ సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మిప్రసన్న, అటవీ శాఖ సిబ్బంది ఇబ్రహీం, అహ్మద్ పాల్గొన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.3 । కనిష్ఠం 24.1





● టైఫాయిడ్ బారిన పడి నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొరిటికల్ గ్రామానికి చెందిన చిన్నారులు



● మామడ మండలం కొరిటికల్ గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన మురికి నీరు



● కొరిటికల్‌లో వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వృద్ధులు

విష జ్వరాల.. విజృంభణ

- జిల్లాలో వైరల్ ఫీవర్‌తో మంచం పడుతున్న గ్రామాలు
- ఎడతెరపిలేని వర్షాలకు రోజురోజుకూ ఈగలు, దోమల ఉధృతి
- పల్లెల్లో పాలకులు లేక పడకేసిన పారిశుధ్య నిర్వహణ
- టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూలతో సతమతమవుతున్న జనం
- జిల్లావ్యాప్తంగా కేవలం 16 డెంగ్యూ కేసులే నమోదైనట్లు వెల్లడిస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయంటున్న ప్రజలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొరవడి సౌకర్యాలు.. 'ప్రైవేటు' వైపు పరుగులు

ఖానాపూర్, జూలై 28: జిల్లాలో ఏ గ్రామంలో చూసినా జ్వరాలతో సతమత మవుతున్న జనమే దర్శనమిస్తున్నారని పలువురు చెబుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది నిర్మల్ జిల్లా ప్రజలను విషజ్వరాల బారీన పడేలా చేస్తున్నాయి. గతంలో పోల్చితే ఈ వర్షాకాలం ఆరంభంలో కనిపించిన మలే రియా, డెంగ్యూ అక్కడక్కడ మాత్రమే పాజిటివ్ వస్తుంటే జ్వరంతో ఆసుపత్రికి వచ్చే రోగుల్లో పది మందిలో ఎనిమిది మందికి టైఫాయిడ్ పాజిటివ్ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెబు తున్న వైద్య శాఖ అధికారులు మాత్రం తమ పనిని తూతూ మంత్రంగా ముగి స్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రు లన్నీ నిత్యం రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులకు అక్కడి వైద్యులు పలు రకాల రక్త పరీక్షలు చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో సామాన్యుడి జేబు కు చిల్లుపడి అప్పులపాలు అవ్వాల్సిన పరిస్థితి వస్తోందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలువురు వైరల్ జ్వరాలు, వ్యాధుల బారీన పడటానికి వాతావరణంలో వస్తున్న మార్పులే కారణమని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో ఈగలు, దోమలు ప్రబలి ఈ పరిస్థితికి కారణమవుతున్నట్లు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం ద్వారా ఈ జ్వరాలను అదుపులో పెట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతు న్నారు. జిల్లావ్యాప్తంగా జ్వరాలు ప్రబలుతున్నందున ప్రతీ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్మల్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రుల్లో కొరవడిన సౌకర్యాలు

జిల్లాలో ప్రస్తుతం వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల లేమీ వెక్కిరిస్తోంది. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్న నేపథ్యంలో రోగుల్లో తమకు మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలాయేమోనని ఆందోళనతో పరీక్షలు చేయించుకునేందుకు ప్రైవేట్ ల్యాబ్‌లను, ఆసు పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్లేట్ లెట్ కౌంటింగ్ తెలుసు కునే హిమోగ్రామ్ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెల్ కౌంటర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ హిమోగ్రామ్ పరీక్షతో పాటు డెంగ్యూ నిఆర్ధరణ పరీక్షలు నిర్వహించాలంటే ఆసుపత్రిని బట్టి ఒక్కో రేటు వసూలు చేస్తున్నారు. ఈ పరీక్షలకు రూ.1200 నుంచి రూ.1500 వరకు తీసుకుంటున్నట్లు రోగులు చెబుతున్నారు. ఇక ప్లేట్ లెట్ కౌంటింగ్ 50 వేలకు తగ్గితే వెంటనే నిర్మల్, నిజా మాబాద్, కరీంనగర్ లాంటి పట్టణాలకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగుల జేబు లకు చిల్లులు పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్న 2వేల మంది నుంచి రక్త నమూనాలు సేకరించి వారికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికా రులు చెబుతున్నారు. ఈ పరీక్షల్లో కేవలం 16 మందికి మాత్రమే డెంగ్యూ ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు పేర్కొంటున్నారు. మరికొంత మందికి టైఫాయిడ్‌తో పాటు వైరల్ ఫీవర్స్ ఉన్నాయని చెబుతున్నారు. అధికారులు చెబుతున్న లెక్కలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలకు సత్య దూరంగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

అందినకాడికి దండుకోవడమే..

నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు పలువురు రోగులకు ప్రథమ చికిత్స అందిస్తూ సేవలందిస్తున్నారు. రాత్రనకాపగలనకా రోగులకు సేవలందిస్తూ రోగి ఆసుపత్రికి వెళ్లే వరకు ఇబ్బంది లేకుండా వైద్యం చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఇలాంటి వారికి మచ్చ తెచ్చే విధంగా అక్కడక్కడ కొంతమంది సేవాభావాన్ని మరిచి ధనార్జనే ధ్యేయంగా వైద్యం పేరుతో దోచుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా పెద్ద గ్రామాలు, మండల కేంద్రాలను అడ్డాగా చేసుకుని ఎలాంటి అర్హత లేకున్నా క్లీనిక్‌లు ఏర్పాటు చేసి క్వాలిఫైడ్ వైద్యులకు ధీటుగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రోగిని పరీక్షించినందుకే రూ. 100కు పైగా ఫీజు, ఆపై పలు పరీక్షలు నిర్వహించాలంటూ మందులు సైతం మెడికల్ షాపు లతో సంబంధం లేకుండా తామే విక్రయిస్తూ నిరుపేదలను నిట్ట నిలువుగా దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నాసిరకం మందులను ఏజెన్సీల లో కొనుగోలు చేసి తమ వద్దకు వచ్చే రోగులకు విక్రయిస్తే ప్రజలను మోసగిస్తే అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమకున్న అర్హతను మించి ఆసుపత్రుల నిర్వహణ చేస్తూ అమాయక ప్రజల నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న చర్యలు చేపట్టాల్సిన జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా చర్య లు చేపట్టకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో అధికారులే పారిశుధ్య పనుల నిర్వహణపై పర్యవేక్షణ చేస్తున్నారు. ఇది కూడా ఒకరకంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించేందుకు ప్రధాన కారణంగా చెబు తున్నారు. గ్రామాలకు పాలకులు లేకపోవడం కేవలం ప్రత్యేక అధికారులు, పం చాయతీ కార్యదర్శుల పాలన మాత్రమే ఉండడంతో ప్రజలు తమ తమ కాలనీ లలో ఉన్న సమస్యలను అధికారులకు చెప్పుకునేందుకు ఇబ్బందులు పడుతున్న ట్లు తెలుస్తోంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలపై మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామడ మండలంలోని కొరిటికల్ గ్రామంలో ప్రతి ఇంట్లో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా లాంటి వైరల్ ఫీవర్స్‌తో మంచం పట్టిన వారే దర్శనమిస్తున్నారు.

రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

: ఏలేటి చిన్నలింగారెడ్డి, కొరిటికల్ గ్రామస్థుడు



మామడ మండలం కొరిటికల్ గ్రామంలో ప్రస్తుతం ఇంటింటా వైరల్ ఫీవర్స్ తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయి. పారిశుధ్యం లోపంతో ప్రతీఒక్కరు మంచం పట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. వెంటనే ప్రభుత్వం స్పందించి రోగాలు ప్రబల కుండా చర్యలు చేపట్టాలి. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి వైరల్ ఫీవర్ బారిన పడిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందజేసి అండగా నిలవాలి.

ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాం : : ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో, నిర్మల్



ప్రస్తుతం జిల్లాలో కొన్ని ప్రాంతాలలో వైరల్ ఫీవర్స్ ఉన్నాయి. ప్రజలు ఆందోళన చెందవద్దు. గ్రామస్థాయిలో ప్రతి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాం. జ్వరాలతో బాధపడేవారు ఏఎన్‌ఎంలకు, ఆశా వర్కర్లకు వివరాలు అందజేయాలి. పీహెచ్‌సీల ద్వారా వైరల్ ఫీవర్స్‌కి చికిత్స చేయించుకోవాలి. ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలు సేకరించి జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడితే వైరల్ ఫీవర్స్ బారినుంచి బయటపడవచ్చు. కొరిటికల్ గ్రామాన్ని సైతం సందర్శించి వైద్య శిబిరాన్ని నిర్వహించాం. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆకస్మిక తనిఖీలతో ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆసుపత్రుల్లో అనవసరంగా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు చేపడతాం.

సంక్షిప్త సమాచారం



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'సిమెంట్ ఫ్లోరింగ్ చేపట్టాలి'

కుభీర్, జూలై 28: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సిమెంట్ ఫ్లోరింగ్ చేపట్టాలని కోరుతూ ఆదివారం భైంసా డిపో మేనేజర్ శ్రీలతకు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సాప పండరి మాట్లాడుతూ ప్రయాణ ప్రాంగణంలో వర్షం పడడంతో బురదమయంగా మారి, ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. గత రెండు రోజుల కింద టైర్ కింద జారి పడి మహిల మృతి చెందిందని, వెంటనే అధికారులు స్పందించి బస్టాండ్‌లో సిమెంట్ ఫ్లోరింగ్ చేపట్టాలని కోరారు.

ప్రధాని మన్ కీ బాత్ వీక్షణ

నిర్మల్ కల్చరల్, జూలై 28: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు జిల్లాకేంద్ర కార్యాలయంలో వీక్షించారు. ప్రధాని స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వారితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇందులో అయ్యన్నగారి భూమయ్య, రాంనాథ్, సామ రాజేశ్వర్ రెడ్డి, పంతికే ప్రకాష్, కే. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

సారంగాపూర్, జూలై 28: మండలంలోని చించోలి (బి) ఎక్స్ రోడ్డు వద్ద నిర్మల్, ఆదిలాబాద్ రహదారికి గుంతలు పడడంతో ఆదివారం సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్‌లు మరమ్మతులు చేపట్టారు. వారం రోజుల నుంచి కురిసిన వర్షానికి రోడ్డుకు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని మరమ్మతులను చేపట్టినట్లు తెలిపారు. దీంతో ఎస్పీ షర్మిలజానకి పోలీసులను అభినందించారు.

వాహనాల తనిఖీ

కుంటాల, జూలై 28: మండలంలోని కల్లూరు సమీపంలో భైంసా- నిర్మల్ జాతీయ రహదారిపై ఎస్సై రజనీకాంత్ వాహనాల తనిఖీ నిర్వహించారు . ఈ సందర్భంగా ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, అంతేగాకుండా మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు. నాలుగు చక్రాల వాహనాలు వారు సీటు బెల్టు ధరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.



కల్లూర్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై



నిర్మల్‌లో బోనాల జాతరలో పాల్గొన్న గౌడ కులస్తులు



పోచమ్మ తల్లికి బోనంతో తరలివెళ్తున్న మున్నూరు కాపులు



నిర్మల్‌లో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాలు

● బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయానికి బోనాలతో మహిళల శోభాయాత్ర ● అమ్మవారికి ప్రత్యేక పూజలు ● జిల్లావ్యాప్తంగా బోనాల పండుగ

నిర్మల్ కల్చరల్, జూలై 28: ఆషాఢ బోనాలు ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్ర ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయానికి భక్తులు, మహిళలు బోనాలతో శోభాయాత్రగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గాంధీ చౌక్ నుండి బోనాలతో బయలుదేరి మహాలక్ష్మి ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకొని బోనం సమర్పించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. కౌన్సిలర్ అపర్ణ ప్రదీప్‌తో పాటు సంఘ అధ్యక్షుడు కోటరిగి శ్రీధర్, వెంకటయ్య, విఘ్నేష్, ప్రదీప్, రాకేష్, విశ్వబ్రాహ్మణులు, మహిళలు పాల్గొన్నారు.

● అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నేత

రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ మహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం ఆషాఢ బోనం సందర్భంగా దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ప్రార్థించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు సాధం అరవింద్, కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, ఎడపల్లి నరేందర్, నాయకులు పద్మాకర్, తోట సత్యనారాయణ, ఆర్. నరేష్, సుధాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. భాగ్యనగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మకు బోనం సమర్పించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

● గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర

నిర్మల్ అర్బన్: నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో భారీగా బోనాల జాతర నిర్వహించారు. సుమారు 500ల గౌడ కుటుంబాలు బోనాలతో ఊరేగింపు చేపట్టారు. ఆదివారం శాస్త్రి నగర్‌లో ఉన్న గీత పారిశ్రామిక సహకార సంఘం నుండి అక్కాపూర్ గ్రామంలో ఉన్న రేణుక మాత ఆలయం వరకు భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనం కుండలతో ఊరేగింపులో పాల్గొన్నారు. బైండ్ల వారి విన్యాసాలు, గౌడశెట్టి కులస్తుల ఒగ్గు కథలు, శివసత్తుల నృత్యాలతో కోలాహలంగా బోనాల జాతర నిర్వహించారు. ఆషాఢ మాసంలో చివరి ఆదివారం కావడంతో భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. గీత పారిశ్రామిక సహకార సంఘం పెద్దలు జీవన్ గౌడ్, లింగ గౌడ్, దేవేందర్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ రమణ గౌడ్, కృష్ణ మోహన్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, రవీందర్ గౌడ్, గంగాధర్ గౌడ్, తదితరులతో పాటు భారీ ఎత్తున గౌడ కులస్తులు పాల్గొన్నారు.



భైంసాలో బోనం ఎత్తిన ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

● బోనమెత్తిన ముథోల్ ఎమ్మెల్యే

భైంసా: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆదివారం బోనాల పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు శోభాయాత్రగా పోచమ్మ, మైసమ్మ క్షేత్రాలకు బోనాలను తీసుకవెళ్లి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ బోనం నెత్తిన పెట్టుకొని మైసమ్మ క్షేత్రంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైసమ్మ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేపట్టిన్నట్లుగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు.



భైంసాలో నిరసన ప్రదర్శనలు చేపట్టిన లబ్దిదారులు



జాతీయ రహదారిపై ర్యాలీగా వెలుతున్న లబ్దిదారులు

కొనసాగుతున్న డబుల్ లబ్ధిదారుల ఆందోళన

● భైంసాలో ఏడో రోజుకు నిరసన దీక్షలు ● ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటికి తరలిన లబ్ధిదారులు ● త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్న పాటిల్

భైంసా, జూలై 28: మౌలిక వసతులు కల్పించి తమకు ఇళ్లను వెంటనే అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ భైంసా డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి ఏడవ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు,అధికారులపై ఒత్తిడి తీసుకవచ్చి తమను సమస్యను పరిష్కరించుకునేందుకు లబ్దిదారులు రోజుకో రీతిలో ఆందోళనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం లబ్దిదారులు జాతీయ రహదారి మార్గం మీదుగా స్థానిక నాందేడ్ క్రాస్ రోడ్డు సమీపంలోని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ నివాస గృహం వరకు ర్యాలీ చేపట్టారు. దారి పొడవునా తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ, ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎడాది కాలం క్రితం లక్కీడ్రా ద్వారా లబ్దిదారులుగా ఎంపికైన తమకు ఇండ్లను కేటాయించకుండా తీరని అన్యాయం చేస్తున్నారంటూ వాపోయారు. అద్దెలు చెల్లించలేక ఎదుర్కొంటున్న కష్టనష్టాలను వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ మాట్లాడుతూ త్వరితగతిన సమస్యను పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతమైన చర్యలు చేపడుతానని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని వెల్లడించి సముదాయించారు.దీంతో శాంతించిన లబ్దిదారులు అక్కడి నుంచి తమ తమ ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు.

ఘనంగా గోరింటాకు మహోత్సవం

ఖానాపూర్, జూలై 28: మండలకేంద్రంలోని గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని విద్యానగర్‌లోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఈ గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించినట్లు గాయత్రి బ్రాహ్మణ సంఘం మహిళలు తెలిపారు. గోరింటాకు చేతులకు పెట్టుకోవడం ద్వారా ఆరోగ్యానికి సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం గోరింటాకుకు మహిళలకు మధ్య విడదీయరాని బంధం ఉంటుందన్నారు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగిన గోరింటాకు ధరించడం అనాదిగా వస్తున్న ఆచారంగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీణ, సరస్వతి, నిమ్మగడ్డ నిఖిత, విష్ణుంబట్ల శుభాంగి, సృజన, ఉమా, శారద, వాసవి, తదితరులున్నారు.



గోరింటాకు మహోత్సవం నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం మహిళలు